ఈ నెల 7న ట్రాన్స్‌జెండర్స్‌కు అవగాహన సదస్సు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ 3 : ఈ నెల 7న జిల్లాలోని ట్రాన్స్‌జెండర్స్‌కు ఓటు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పద్మజ రమణ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్త్రీ శిశు, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ శాఖ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని మహిళా సాధికారిక కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌జెండర్స్ సర్టిఫికెట్స్ రిజిస్ట్రేషన్‌కు కావాల్సిన అఫిడవిట్స్, క్వీర్‌బంధు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు ముకుందమాల ఉచితంగా అందజేస్తారని చెప్పారు.


సూర్య @ 45.7



- ఉమ్మడి జిల్లాలో ఆల్‌టైం రికార్డ్ ఉష్ణోగ్రత
- మేడ్చల్ జిల్లా కీసరలో 45.7, బంట్వారంలో 45.4, చిలుకూరు సమీపంలోని మృగవనిలో 45.2 డిగ్రీలు నమోదు
- పగలు భానుడి భగభగలు.. రాత్రి సెగలు
- ఉక్కపోతతో పిల్లలు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/వికారాబాద్/మేడ్చల్, మే 3 : ఉమ్మడి జిల్లాలో ఎండలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. శుక్రవారం మేడ్చల్, వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తొలిసారిగా జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటాయి. ఉదయం 8.30 గంటల నుంచే ఎండలు తీవ్రం కావడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ తీవ్రతకు వడగాల్పులు కూడా తోడవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటినా ఎంత సెగ తగ్గడం లేదు. రాత్రి పూట వేడి ఏమాత్రం తగ్గడం లేదు. పెరిగిన ఉష్ణోగ్రతతో జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చంటి పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు వర్ణణాతీతం. రైతులు ఉదయం 9 గంటల్లోగా పొలం పనులు ముగించుకుని ఇంటి బాట పడుతున్నారు. ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసరలో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా బంట్వారంలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా రంగారెడ్డి జిల్లా చిలుకూరు మృగవని ప్రాంతంలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం, పుట్టపహడ్‌లో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మర్పల్లిలో 44.2 డిగ్రీలు, నవాబ్‌పేట్‌లో 43.8 డిగ్రీలు, పూడూరు మండలం, పెద్ద ఉమ్మెంతాల్‌లో 43.7 డిగ్రీలు, దుద్యాల్‌లో 43.6 డిగ్రీలు, వికారాబాద్‌లో 43.5 డిగ్రీలు నమోదయ్యాయి. కొడంగల్‌లో 43.3 డిగ్రీలు, బషీరాబాద్ మండలం, కాశీంపూర్‌లో 43.3 డిగ్రీలు, తాండూరులో 43.3 డిగ్రీలు, కోట్‌పల్లిలో 43.2 డిగ్రీలు, మోమిన్‌పేట్‌లో 43.0 డిగ్రీలు, బంట్వారం మండలం, నాగారంలో 43.0 డిగ్రీలు, బషీరాబాద్‌లో 42.6 డిగ్రీలు, ధారూరులో 42.6 డిగ్రీలు, పరిగి మండలం, రాపోల్‌లో 42.5 డిగ్రీలు, పూడూరు మండలం, మన్నేగూడలో 42.6 డిగ్రీలు, దౌల్తాబాద్‌లో 42.5 డిగ్రీలు, కులకచర్ల మండలం, ముజాహిద్‌పూర్‌లో 42.5 డిగ్రీలు, యాలాల్‌లో 42.3 డిగ్రీలు, యాలాల్ మండలం, దౌలాపూర్‌లో 42.3 డిగ్రీలు, పెద్దేముల్‌లో 42.3 డిగ్రీలు, బొంరాస్‌పేట్‌లో 42.2 డిగ్రీలు, చౌడాపూర్‌లో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దోమలో 41.7 డిగ్రీలు, పరిగిలో 41.5 డిగ్రీలు, వికారాబాద్ మండలం, మద్గుల్ చిట్టంపల్లిలో 41.4 డిగ్రీలు, మదన్‌పల్లిలో 41.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఓటింగ్‌కు దూరం!



లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా చదువుకున్న వారు, ఉద్యోగస్తులు, యువత అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో శివార్లలో అనేక నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరుగుతుందని అంతా భావించారు. అయితే ఎక్కడా ఆ మేర పెరగలేదు. పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఓటర్లలో చైతన్యం రావడం లేదు. ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లోనైనా ఓటింగ్ శాతం పెరుగుతుందేమో వేచి చూడాలి.

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్‌కు భారీగా తగ్గుదల

- గతంలో సగటు 12శాతం తగ్గిన ఓటింగ్
- పట్టణాల్లో పరిస్థితి మరింత దారుణం
- విద్యావంతులంతా పోలింగ్‌కు దూరం
- 45 శాతానికి మించని పోలింగ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టుగా భావించే ఓటింగ్ ప్రక్రియకు మెజార్టీ ప్రజలు దూరంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌శాతం గణనీయంగా తగ్గుతోంది. లోక్ సభ ఎన్నికల్లో ఓటేసేందుకు ప్రజలు ముందుకు రావడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా చదువుకున్న వారు, ఉద్యోగస్తులు, యువత అధికంగా ఉండే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. నగర శివార్లలో 45శాతానికి మించి ఓటింగ్ జరగకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 2018 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2019 ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు సగటు 12శాతం మంది ఓటర్లు దూరంగా ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో శివార్లలో అనేక నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ జరగడంతో ఓటింగ్‌శాతం పెరుగుతుందని అంతా భావించారు. అయితే ఎక్కడా కూడా ఆ మేర ఓటింగ్ పెరగలేదు. భారీగా ఓటింగ్ తగ్గుదలతో అభ్యర్థుల గెలుపుఓటములపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.

అవగాహన కల్పించినా...

ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఓటర్లలో చైతన్యం రావడం లేదు. రానున్న లోక్‌సభ ఎన్నికలల్లోనైనా ఓటు వేసేందుకు అర్హులైన ఓటర్లు అందరూ ముందుకు రావాలని ప్రజాస్వామ్యవాదులు, అధికారులు కోరుతున్నారు. గత 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సగటు భారీగా ఓటింగ్ తగ్గింది. గత లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కేవలం 42.75 శాతం మాత్రమే పోలింగ్ జరగడం గమనార్హం. అలాగే చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 53.80శాతం పోలింగ్ జరిగింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసేందుకు జనం పెద్దగా ఆసక్తిచూపలేదు. నిర్లక్ష్యంతో ఎంతో మంది ఓటర్లు ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోలేదు. దీంతో అనేక పట్టణ ప్రాంత నియోజకవర్గాల్లో 45శాతం కూడా పోలింగ్ జరగలేదు.

పార్లమెంట్ ఎన్నికలను పట్టించుకోని ఓటర్లు

తగ్గుదల ఇలా...

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 12.67శాతం, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో 10.88శాతం ఓటింగ్ ఓటింగ్ తగ్గడం గమనార్హం. పార్లమెంట్ ఎన్నికలు వేసవిలో రావడంతో ఎండతీవ్రత కూడా ఓటింగ్‌శాతానికి తగ్గడానికి కొంత కారణంగా చెబుతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో అతి తక్కువగా శేరిలింగంపల్లిలో 35.52శాతమే ఓటింగ్ నమోదైంది. అలాగే ఉప్పల్‌లో 38.08శాతం, ఎల్‌బీనగర్‌లో 37.37శాతం ఓటింగ్ నమోదైంది. గత 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2019 పార్లమెంట్ ఎన్నికల్లో తాండూరు అసెంబ్లీ పరిధిలో అత్యధికంగా 17.98శాతం ఓటింగ్‌శాతం తగ్గింది. అలాగేపరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 13.49శాతం, శేరిలింగంపల్లిలో 12.99శాతం, వికారాబాద్ నియోజకవర్గంలో 11.47శాతం, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 8.93శాతం, మహేశ్వరం నియోజకవర్గంలో 8.39శాతం, చేవెళ్లలో 6.73శాతం ఓటింగ్ తగ్గింది. ఇక మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 13.46శాతం, కుత్బుల్లాపూర్‌లో 12.65శాతం, కూకట్‌పల్లిలో 12.4శాతం, మల్కాజిగిరిలో 10.66శాతం, ఎల్‌బీనగర్‌లో 11.96శాతం, మేడ్చల్‌లో 8.42శాతం, కంటోన్మెంట్‌లో 6.7శాతం ఓటింగ్ తగ్గింది.

అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం			పార్లమెంట్‌కు అసెంబ్లీ వారీగా
నియోజకవర్గం	2018	2023	2019
తాండూరు	76.98	73.71	59.00
వికారాబాద్	73.68	75.57	62.21
పరిగి	75.63	76.70	62.14
మహేశ్వరం	55.08	55.39	46.69
రాజేంద్రనగర్	56.80	55.83	47.87
శేరిలింగంపల్లి	48.51	48.75	35.52
చేవెళ్ల	78.67	74.18	71.04
ఇబ్రహీంపట్నం	76.45	74.93	76.45
ఎల్బీనగర్	49.33	49.07	37.37
మేడ్చల్	60.72	62.24	52.01
మల్కాజిగిరి	53.19	54.02	41.02
కుత్బుల్లాపూర్	56.05	57.18	43.19
కూకట్‌పల్లి	57.18	53.87	45.33
ఉప్పల్	51.65	51.54	38.08

ప్రతీ ఒక్కరు ఓటు వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి రంగారెడ్డి అర్బన్ 3 : ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని, అందుకోసం అన్ని చర్యలూ తీసుకున్నామని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. శుక్రవారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్‌ల కోసం హోం ఓటింగ్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 54 టీంలతో ఈ నెల 4 నుంచి 6 వరకు హోం ఓటింగ్ జరుగుతుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఏవీఎస్‌వీ 695, ఏవీపీడీ 420 మంది ఓటర్లు ఉండగా వీరంతా తమ ఓటుహక్కును హోం ఓటింగ్ ద్వారా వినియోగించుకోనున్నారని స్పష్టం చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం శేరిలింగంపల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు సౌకర్యాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పోస్టల్ బ్యాలెట్ సేకరణ, ఓటింగ్ సరళి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని సూచించారు. ఓటరు హెల్ప్‌లైన్ కౌంటర్ వద్దనే ఓటరు జాబితాలోని క్రమసంఖ్య, పార్టునెంబర్‌ను పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు మే 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్నేహ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ శశాంక పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రజినీకాంత్‌రెడ్డి ఉన్నారు.



శేరిలింగంపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటేసేలా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి సెగ్మెంట్ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

బీజేపీని ప్రశ్నిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

- రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తాం.. ప్రజలను చైతన్యపరుస్తాం
- విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్ అర్బన్, మే 3 : లోక్‌సభ ఎన్నికల సంగ్రామంలో అధికార భారతీయ జనతా పార్టీని ప్రశ్నిస్తూ.. ప్రమాదంలో పడబోతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ పీపుల్స్ జేఏసీ కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం హరగోపాల్ మాట్లాడారు. గత పదేళ్ళుగా అధికారంలో ఉన్న బీజేపీ.. పన్నుల పేరుతో పేదలను దోచి, పెద్దలకు పెడుతూ వస్తున్నదని ఆరోపించారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకుల ప్రసంగాలు వింటుంటే.. ఎన్నికల తరువాత బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే.. ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు ఉంటాయా? అన్న ప్రశ్న తలెత్తుతుందని హరగోపాల్ అన్నారు. ప్రశ్నించే ప్రజా సంఘాలు, జర్నలిస్టుల పరిస్థితులు ఎలా ఉంటాయోనని భయం వేస్తోందన్నారు. బీజేపీ తన అధికార బలాన్ని వినియోగించి ప్రజాహక్కుల సంఘాలు, ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపించిందన్నారు. ఏకపక్ష నిర్ణయాలు, కక్షసాధింపు చర్యలు, స్వార్థపూరిత రాజకీయాలకు ఒడిగడుతున్న బీజేపీని ప్రజలు ప్రశ్నించాలని కోరారు. భారతదేశంలో పుట్టిన అందరికీ సమాన హక్కులు ఉండాలని, మైనార్టీల పట్ల కక్షసాధింపు ప్రసంగాలు చేయొద్దని, వివక్ష చూపొద్దని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను, ప్రజాస్వామ్య విలువలను, స్వేచ్ఛాయుత వాతావరణ కోసం ప్రతీ ఒక్కరు ఆలోచించి ఓటు వేయాలని హరగోపాల్ కోరారు. ఈ విషయంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. తెలంగాణ పీపుల్స్ జేఏసీ కో-కన్వీనర్ రవిచంద్ర మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులను ప్రజా సమస్యలపై ప్రశ్నించాలని ఆయన కోరారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవచారి మాట్లాడుతూ గత ప్రభుత్వం షాద్‌నగర్ ప్రాంతంపై తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించాల్సిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించకపోగా.. వ్యవసాయ భూముల్లో కాలుష్య కారక పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించిందని ఆరోపించారు. ప్రభుత్వాలు మారినా సమస్యలపై తమ పోరాటం ఆగదన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని రాఘవచారి తెలిపారు. సమావేశంలో జేఏసీ నాయకులు వనమాల, సత్య, అర్జునప్ప, తిరుమలయ్య, ముత్తయ్య, యాదయ్య, జనార్దన్, ఎం.నర్సింహులు, రవీంద్రనాథ్, టీజీ శ్రీనివాస్, రవికుమార్, జైపాల్‌రెడ్డి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్



35 కిలోల బంగారం, 40 కిలోల వెండి ఆభరణాలు సీజ్

- శంషాబాద్ విమానాశ్రయంలో పట్టుకున్న పోలీసులు
- ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న ఏడుగురు నిందితులు అదుపులోకి..

శంషాబాద్/శంషాబాద్ రూరల్, మే 3 : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం పెద్ద ఎత్తున బంగారంతో పాటు వెండి ఆభణాలు పట్టుపడ్డాయి. ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు యత్నించిన ఏడుగురు నిందితులను ఎలక్షన్ స్క్వాడ్, ఆర్జీఐఏ పోలీసులు తనిఖీ చేసి 35కిలోల బంగారం 40 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, పట్టుబడిన బంగారం, వెండి నగలకు సంబంధించి పూర్తిస్థాయిలో రశీదులు లేవు. కొన్ని ఆభరణాలకు మాత్రమే ఉండటంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు కలెక్టర్ కార్యాలయంలోని ఎన్నికల ప్రత్యేకాధికారుల వద్దకు సీజ్ చేసిన బంగారం, వెండి పంపినట్లు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.

ధాన్యం కొనండి సారూ!

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా జరగని కొనుగోళ్లు
- ఆమనగల్లు మార్కెట్‌లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు
- తాలు పేరుతో కొనుగోలుకు నిరాకరణ
- నిబంధనల ప్రకారం ఉంటేనే కొంటామంటున్న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు
- తేమశాతం సరిగానే ఉందంటున్నరైతులు
- ఇద్దరి మధ్య వివాదంతో ఆగిన కొనుగోళ్లు
- 20రోజులుగా కొనుగోలు కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

ఆమనగల్లు, మే 3: రైతులు పండించిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కేంద్రాలను తెరిచింది. రైతుల వద్ద నుంచి ప్రతీ గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దీంతో రైతులు ఆనందంలో మునిగిపోయారు. తీరా ధాన్యం అమ్ముదామని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళితే అక్కడ కొనుగోళ్లు జరగడం లేదు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తెస్తేనే కొంటామని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చెబుతుంటే.. తేమ శాతం సరిగానే ఉందని, వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు వాదిస్తున్నారు. ఈ వివాదంతో ఆమనగల్లు మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిచిపోయాయి.

ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో పౌరసరఫరాల శాఖ సహకారంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఆ నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసింది. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు తప్పవని పేర్కొంది. అదేవిధంగా తరుగు పేరుతో కోత విధిస్తే మిల్లర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ సీజన్‌లో ఆమనగల్లు ప్రాంతంలో ఈ ఏడాది వరి దిగుబడి బాగా వచ్చింది. ఇప్పటికే 75 శాతం మంది రైతులు ధాన్యాన్ని మిల్లర్లు, దళారులకు విక్రయించారు. కల్లాల నుంచి నేరుగా తరలించిన వరి దొడ్డు రకం ధాన్యానికి క్వింటాల్‌కు మిల్లర్లు రూ.1,700 నుంచి రూ.1,850, సన్న రకానికి రూ.2,100 నుంచి రూ.2,250 వరకు ధర ఇస్తుండడంతో ఎక్కువగా ఈసారి ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్ల వైపే రైతులు మొగ్గు చూపారు. తాలు, దుమ్ము, తేమ శాతం ఏదీ చూడకుండానే మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో మాత్రం ప్రభుత్వ ప్రకటించిన నాణ్యతా ప్రమాణాలు ఉంటేనే కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. మద్దతు ధర వస్తుందన్న ఆశతో ఆమనగల్లు మండలంలోని పలు గ్రామాల రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినా తాలు ఉందన్న నెపంతో కొనుగోలు చేయడం లేదు. కల్లాల నుంచి రైతులు ధాన్యాన్ని హార్వెస్టర్ల నుంచి నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తున్నారు. ధాన్యాన్ని తూర్పాల బట్టి తాలును తొలగించి ప్రభుత్వం ప్రకటించిన నాణ్యతా ప్రమాణాల మేరకు తెస్తే తూకం వేస్తామని.. అప్పటి వరకు తాము తూకాలు వేయమని కేంద్రం నిర్వాహకులు ఖరాఖండిగా చెబుతున్నారు. అయితే, తేమ శాతం సరిగా ఉంది కాబట్టి తూకాలు వేయాలని రైతులు ఒత్తిడి తెస్తున్నారు. మిల్లర్లు నిబంధనల మేరకు దాన్యాన్ని కొనుగోలు చేసి ఇస్తేనే తీసుకుంటామని తెలుపుతుండడం, రైతులు తుర్పార బట్టి తాలు ను తొలగించడానికి నిరాకరిస్తుండడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కొనుగోళ్లు జరుగక 20రోజులుగా మార్కెట్ యార్డ్‌లో ధాన్యం రాసులు పేరుకుపోయాయి.



కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం రాశులు

తాలు సాకుతో ఇబ్బంది పెడుతున్నారు



మద్దతు ధర వస్తుందని 20 రోజుల నుంచి 80 క్వింటాళ్ల ధాన్యాన్ని రెండు సార్లు ఆమనగల్లు మార్కెట్‌లోని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. తాలు సాకు, నాణ్యతా ప్రమాణాల పేరుతో కేంద్రం నిర్వాహకులు తూకం వేయడం లేదు. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకోవాలంటున్న ఎవరూ స్పందించడం లేదు. వారాల తరబడి ధాన్యాన్ని అమ్మకానికి మండుటెండలో ఉండలేక వేదనకు లోనవుతున్నాం.

- బైకని యాదయ్య, రైతు, జంగారెడ్డిపల్లి

రైతులు సహకరించడం లేదు



ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా నడుచుకుంటున్నాం. నాణ్యతలేని ధాన్యాన్ని కొనుగోలు చేసి తరుగు పేరుతో కట్ చేస్తే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, మిల్లర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. తాలు తొలగించి ధాన్యాన్ని తీసుకు వస్తే తూకాలు వేస్తామని చెప్పాం. తుర్పాల కోసం ఫ్యాన్లను కూడా అందుబాటులో ఉంచాం. దీనికి రైతులు సహకరించడం లేదు.

- గంప వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్, ఆమనగల్లు

మామిడి.. మరింత పిరం




పూడూరు మండలం మన్నెగూడలో మామిడిపండ్ల అమ్మకాలు

● ఈ సారి తగ్గిన మామిడి ఉత్పత్తులు

పరిగి, మే 3: వేసవిలో లభించే ఫలాల్లో రారాజు అయిన మామిడికి ప్రత్యేక స్థానముంది. నోరూరించే బంగినపల్లి మామిడి పండుకు మార్కెట్‌లో ఎంత పేరుందో.. రాజధాని శివారులోని పూడూరు బేనిషాన్‌కు అంతే పేరుందనడం అతిశయోక్తి కాదు. సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండే పండ్లలో ప్రధానమైనది మామిడి పండు. వేసవిలో నోరూరించే పండుగా భావిస్తున్న మామిడి పండు తినాలని ప్రతీఒక్కరు ఆసక్తి చూపుతారు. మామిడిచెట్లుమీద మగ్గిన పండు రుచి ఇక చెప్పనక్కర్లేదు. జిల్లాలోని 18మండలాల్లో మామిడి పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. పదేళ్ల నుంచి జిల్లాలో మామిడి తోటల విస్తీర్ణం పెరుగుతోంది. ఏరైతు చూసినా తమకు ఉన్న పొలంతో కొంతనైనా మామిడి తోటలను పెంచాలని మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం పరిగి, వికారాబాద్, తాండూరు మార్కెట్లలో మామిడి పండ్ల విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా పూడూరు మామిడి తోటలకు ప్రసిద్ధిగా చెప్పుకోవచ్చు. ఇక్కడ పండించిన పండ్లను రాజధాని హైదారాబాద్ నగరమే కాకుండా రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలోని మార్కెట్‌లలో కూడా పూడూరు ఎంతో ప్రసిద్ధి. మామిడి పూత వచ్చే సమయంలో అనుకూలించని కాలం కారణంగా ఈసారి కాత ఆశించిన విధంగా లేక ధరలు కూడా భగ్గుమంటున్నాయి. జిల్లాలోని ఒక్క పూడూరు మండలంలో నాలుగు వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. మిగతా మండలాల్లో మరో 10వేలకు పైగా మామిడి తోటలు సాగులో ఉన్నాయి. మామిడి పండ్ల వ్యాపారం కోట్లలో జరుగుతుంటుంది. ఈసారి మామిడితోటల్లో కాపు ఆశాజనకంగా లేదు. ఈసారి ఎండల తీవ్రత కారణంగా మామిడి తోటకు తీవ్రనష్టం వాటిల్లింది. ప్రస్తుతం మార్కెట్‌లలో ఎక్కడ చూసినా మామిడి పండ్ల దుకాణాలే దర్శనమిస్తున్నాయి.

మామిడి పండ్లకు కేరాఫ్ అడ్రస్‌గా పూడూరు

జిల్లాలోనే మామిడిపండ్లకు పూడూరు మండలమే కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఇందులో ముఖ్యంగా పూడూరు మండలం పూడూరు, మన్నెగూడ, రాకంచర్ల, పెద్ద ఉమ్మెంతాల్లో మామిడి తోటలో అనేక రకాల పండ్లు లభ్యమవుతాయి. రాకంచర్ల తోట నుంచి మామిడి పండ్లను హైదారాబాద్‌తోపాటు, ఇతర రాష్ట్రాలకు తరలిస్తారు. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూర్ పట్టణాలకు ఇతర ప్రాంతాల నుంచి భారీగా మామిడి పండ్లను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. జిల్లాలో ఆశించిన విధంగా మామిడి తోటలు లేనికారణంగా మామిడిలోని వివిధ కొత్త రకాలను ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం పూడూరు మండలం రాకంచర్ల ఏ రకం మామిడి అయినా లభ్యమవుతున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి

మామిడిలో పోషక విలువలు

మన దేశంలోనే మామిడికి ప్రత్యేక స్థానముంది. మామిడిలో ప్రధాన రకాలు తోటపురి, నీలం, బంగినపల్లి, బేనీషా, రత్న, పెద్ద రసం, మంజీరా, స్వర్ణరేఖ, దషేరి వంటి రకాలు ఎన్నో ఉన్నాయి. మాగిన ఒక మామిడి పండులో 86 శాతం నీరు. 0.6శాతం మాంసకృత్తులు, 0.1శాతం కొవ్వు పదార్థాలు, 11.8 సుక్రోజ్, గ్లూకోజ్, ఫ్రక్టోస్ వంటి రసాయనాలు ఉంటాయి. తక్కువ శాతంలో రిబోఫ్లావిన్, కాల్షియం, భాస్వరం, ఇనుము వంటి మరెన్నో ఖనిజ లవణాలు లభిస్తాయి. ఎంతో రుచిని అందించే మామిడిని తినడానికి అందరూ ఇష్టపడతారు.

మార్కెట్‌లో లభిస్తున్న పండ్లు

మామిడి రుచి తగ్గంటూగానే ధరలు కూడా మందంగానే ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే మామిడి పండ్లకు ఈ ఏడాది కాపు తక్కువగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే మామిడి పండ్ల ధరలు కాస్త ఎక్కువగానే ఉంటున్నాయి. ఈ ఏడాది రకాలను బట్టి రూ.100-రూ.180ల వరకు పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక రకాల మామిడి పండ్లు లభిస్తున్నాయి. వాటిలో కిలోచొప్పున హిమాయత్ రూ.160, కేసరి రూ.90, గోవా రూ.90, మహిముద రూ.100, పంచదార రూ.90, బేనిషాన్ రూ.90 ధర పలుకుతున్నాయి. అదేవిధంగా ఆఫూస్ రూ.90, పెద్దరసాలు రూ.100, చిన్నరసాలు రూ.90, సపేద రూ.90, జాంగీర్ రూ.90, దశరిమహిముద రూ.90, చెరకు రసాలు రూ.90, మల్గోబా రూ.90, మంజీర రూ.90, మలెక రూ.90, లంగ్ద రూ.90, తోటాపరి రూ.90 పలుకుతున్నాయి.

కార్బైట్‌తో మాగించిన పండ్లు తినొద్దు



నిషేధిత కాల్షియం కార్బైట్‌తో మగ్గించిన మామిడిపండ్లను తినొద్దు. సీజన్ కంటే ముందుగానే కాయలను కూడా పండ్లుగా చేస్తున్నారు. అదేవిధంగా పండ్లు మంచి రంగులో కనిపించడానికి కార్బైట్‌తో పాటు, ఇతర రసాయనాలు వాడుతున్నారు. ఇలా రసాయనాలు చల్లిన మామిడి పండ్లను తినడం వల్ల ప్రమాదకర వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. ముఖ్యంగా వేసవిలో ఇలాంటి పండ్ల తినడం ద్వారా విరేచనాలకు గురికావచ్చు. ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు కూడా దారి తీయొచ్చు. కార్బైట్‌తో కాకుండా నేచురల్‌గా లభించే పండ్లనే తినాలి.

-డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిగి

'ఉపాధి' కూలీలు జాగ్రత్తలు పాటించాలి

● డీఆర్‌డీవో పీడీ కృష్ణన్, ఆర్డీవో శ్రీనివాస్

కొడంగల్, మే 3: వేసవి దృష్ట్యా కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని డీఆర్‌డీవో పీడీ కృష్ణన్, ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అప్పాయిపల్లిలో శుక్రవారం ఎంపీడీవో ఉషశ్రీతో కలిసి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఉదయం 12గంటల్లోపు ఇంటికి వెళ్లాలని సూచించారు. పనిప్రదేశంలో ఉపాధి కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎండ వేడిమి అధికంగా ఉండటంతో పని ప్రదేశాల్లో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, నీడ సౌకర్యం కోసం టెంట్లు తదితర వాటిపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీవో రాములు, టెక్నికల్ అసిస్టెంట్ మహేశ్వరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ కృష్ణన్

వేతనాలు చెల్లించాలి

ఘట్‌కేసర్, మే 3: చౌదరిగూడలో గల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం తమకు ఇవ్వాల్సిన వేతనాలు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎక్స్‌పర్ట్‌ఫోర్స్ సెక్యూరిటీ సంస్థ జీఎం సంతోష్‌సింగ్, మేనేజర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో వాపోయారు. కొన్ని నెలలుగా కళాశాలలో ఎక్స్‌పర్ట్‌ఫోర్స్ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ సేవలు అందిస్తున్నామని, అయితే నాలుగు నెలలుగా యాజమాన్యం జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రూ.2.70లక్షల బకాయిలు రావాలన్నారు. నిత్యం కళాశాల యాజమాన్యంను తమగోడు వినిపిస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కళాశాల యాజమాన్యం స్పందించి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

బోధనలో ప్రావీణ్యం పొందాలి

ఘట్‌కేసర్ రూరల్, మే 3: అధ్యాపకులు బోధనలో ప్రావీణ్యం పొందాలని అనురాగ్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ముత్తారెడ్డి సూచించారు. మండలంలోని అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం స్టాఫ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తారెడ్డి మాట్లాడుతూ.. అధ్యాపకులు స్టాఫ్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రొఫెషనల్ టీచర్లుగా కేరీర్‌ను నిర్మించుకోవడానికి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



స్టాఫ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న అధ్యాపకులు













పరిగిలో పోస్టల్ ఓటు అందజేస్తున్న అధికారులు

తొలిరోజు 124 మంది పోస్టల్ ఓట్లు నమోదు

పరిగి, ఏప్రిల్ 3: ఈనెల 13న జరగనున్న పార్లమెంట్ పోలింగ్‌లో భాగంగా శుక్రవారం ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటువేసే ప్రక్రియను ప్రారంభించారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్‌నెం.02 పాఠశాలలో తొలిరోజు 124మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినిగించుకున్నారు. పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3598 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.వాసుచంద్ర తెలిపారు. వీరిలో ఇప్పటి వరకు 800మందికి బ్యాలెట్ ఓటును జారీచేయగా, తొలిరోజు 124మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పోస్టల్ ఓట్ల కోసం ప్రత్యేకంగా ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. మూడు నుంచి 8 లోపు పోస్టల్ ఓటు వేసుకోవచ్చని సూచించారు.

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి

» మాజీ మంత్రి సబితారెడ్డి.. శంకర్‌పల్లిలో రోడ్‌షో

శంకర్‌పల్లి, మే 3 : బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసిన ఎంపీ రంజిత్‌రెడ్డికి ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని, అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి శంకర్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ నాయకులతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ఇంటి మీద వాలిన కాకి.. తన ఇంటి మీద వాలనివ్వాలని ప్రగల్భాలు పలికినా.. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిని ఎందుకు కాంగ్రెస్‌లో చేర్చుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అంతకుముందు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలన్నారు. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజల గొంతుకను అవుతానన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన హమీలను పూర్తిగా విస్మరించిందన్నారు. బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



పెద్దేముల్ : మంబాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి : జడ్పీటీసీ

షాబాద్/చేవెళ/శంషాబాద్‌రూరల్/కందుకూరు : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశాడని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండలం అప్పారెడ్డిగూడ, మన్‌మర్రి, బోడంపహాడ్‌లో జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, తదితరులున్నారు. చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ ఎన్కెపల్లి, ఊర్లపల్లిలో ప్రచారం చేశారు. జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తామన్నారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్, తదితర నాయకులున్నారు. జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ శంషాబాద్ మున్సిపల్‌లోని 11వ వార్డులో కౌన్సిలర్ లావణ్యతో పాటు బీఆర్ఎస్ అధ్యక్షులు పెంటయ్య, సుదర్శన్ ఓటర్ల మద్దతు కోరారు. అలాగే ప్రత్యేక రాష్ట్రంలో పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడానికి పెద్దపీట వేసిందని ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్‌లు అన్నారు. కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు కందుకూరు గ్రామాల్లో జి.లక్ష్మీనర్సింహ్మారెడ్డి, ఎలుక మేఘనాథ్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి ప్రచారం చేశారు. శ్రీహరి, కాకి రాములు తదితరులున్నారు.

ఎన్నికల కోసం కాంగ్రెస్ కొత్త వేషం : రోహిత్‌రెడ్డి

పెద్దేముల్ : ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పంద్రాగస్టుకు హామీలన్నీ నెరవేరుస్తామని కాంగ్రెస్ నాయకులు కొత్తవేషం కట్టారని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు మంబాపూర్, గాజీపూర్ గ్రామంలో ప్రచారం చేశారు. జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : మాట్లాడుతున్న సబితారెడ్డి, పక్కన కాసాని జ్ఞానేశ్వర్

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

పరిగి/దోమ/చందానగర్/హైదర్‌నగర్/రాయదుర్గం/మియాపూర్: కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటేసి గెలిపించాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ కోరారు. పరిగి సంతలో శుక్రవారం కారు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, టి.వెంకటేశ్, మునీరు, నయూమ్ పాల్గొన్నారు. దోమ మండలం మోత్కుర్‌లో వైస్ ఎంపీపీ మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రావు ఇంటింటి ప్రచారం చేశారు. జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా చందానగర్‌లో కార్పొరేటర్ మంజులారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, గచ్చిబౌలి నానక్‌రాంగూడలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియోకాలనీ, టీఎస్‌నగర్, ఎంఎనగర్ కాలనీల్లో జీహెచ్ఎంసీ స్టాండింగ్‌కమిటీ మెంబర్, కార్పొరేటర్ శ్రీకాంత్ ప్రచారం నిర్వహించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి : ఈటల జమున

జవహర్‌నగర్, మే 3 : దేశాభివృద్ధి కోరుకునే వారందరూ బీజేపీకే ఓటు వేయాలనీ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్ మార్వాడిలైన్‌లో మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి లిఖితయాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు.

కాప్రా డివిజన్‌లో భేతి సుభాష్‌రెడ్డి ప్రచారం

కుషాయిగూడ: మల్కాజిగిరి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్ధతుగా శుక్రవారం కాప్రా డివిజన్‌పరిధిలోని పలు కాలనీల్లో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాంధీనగర్, శ్రీరామ్ నగర్, బాలాజీ ఎన్‌క్లేవ్‌లో పాదయాత్ర చేస్తూ కమలం గుర్తుకు ఓటేయాలని, ఈటలను గెలిపించాలని సుభాష్ రెడ్డిఓటర్లను అభ్యర్థించారు.

కార్పొరేటర్ చేతన ప్రచారం

రామంతాపూర్: మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్‌కు మద్దతుగా హబ్సిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు హరీష్ ఆధ్వర్యంలో మహేశ్వరినగర్, గాంధీ గిరిజన బస్తీలో కార్పొరేటర్ చేతన ప్రచారం నిర్వహించారు.ఈటలను గెలిపించాలని పిలుపు నిచ్చారు.

సైదోనిగడ్డ తండాలో బీజేపీలో చేరిక

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మండలం సైదోనిగడ్డ తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం రైతు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు నారెడ్డి నందారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. నందారెడ్డి వారికి శాలువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారు కష్టపడి పనిచేసి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శైలజాహరినాథ్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లోని మార్వాడిలైన్‌లో ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున



కాప్రాలో పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ నాయకులు



బీజేపీలో చేరుతున్న సైదోనిగడ్డ తండా వాసులు

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

● కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్, మే3 : అసెంబ్లీ ఎన్నికలు సెమీ ఫైనల్స్ అయితే పార్లమెంట్ ఎన్నికలు ఫైనల్స్ అని, సెమీ ఫైనల్స్‌లో తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, పార్లమెంటు ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు గడగడపకు వెళ్లి పార్టీని గెలిపించాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అత్తాపూర్ ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్‌లో యువజన కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తనపై భూ కబ్జాలు, దాణా కుంభకోణం అంటూ చేస్తున్న ఆరోపణలలో ఒక్కటైన నిరూపించాలని.. అందుకు ఆయన ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని సవాల్ విసిరారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు పూర్తి చేయడం జరిగిందన్నారు. కాగా, బీజేపీ నాయకులు జై శ్రీరాం అంటున్నారు.. మా రంజిత్‌రెడ్డే రాముడు.. మా వదినే సీత అని కాంగ్రెస్ నాయకుడు బండ్ల గణేశ్ అన్నారు. రామ సీతలను చేవెళ్ల ఎంపీగా గెలిపించండి అని యువజన కాంగ్రెస్ నాయకుల కరతాళధ్వనుల మధ్య ప్రసంగించారు. రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషీ పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ : మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్

మహేశ్వరం/బషీరాబాద్/వికారాబాద్/ధారూరు/నవాబుపేట/కులకచర్ల/పరిగి/షాబాద్/చేవెళ్ల/హైదర్‌నగర్/కందుకూరు: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. మహేశ్వరం పట్టణకేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ముస్లిం మత పెద్దలతో చర్చించి ఆరు గ్యారెంటీలను వివరించారు.రంజిత్‌రెడ్డిని గెలుపునకు కృషి చేద్దామని తాండూరు మాజీ ఎమ్మెల్యే నారాయణరావు తనయుడు రోహిత్ అన్నారు. బషీరాబాద్ మండల కేంద్రంలో ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని వికారాబాద్ పట్టణాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి శివాజీనగర్ కాలనీలో ప్రచారం చేశారు. ధారూరు శివారులో వరి పొలాల వద్ద, మండల కేంద్రంలో నాయకులు ప్రచారం చేశారు. తిమ్మనగర్ శివారులోని వ్యవసాయ పొలాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి రంజిత్ రెడ్డికి ఓటేయ్యాలని ఓటర్లను కోరారు. నవాబుపేట మండలాధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో అత్తాపూర్, నారేగూడ, గంగ్యాడ, ఎత్రాజ్‌పల్లిలో ప్రచారం చేశారు. అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నేనావత్ రాహుల్‌నాయక్ కలకచర్ల మండలం సాల్వీడ్‌లో ప్రచారం చేశారు. పరిగి మండలాధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రాంచంద్రయ్యలు రంగాపూర్, మాదారం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్‌రెడ్డిలు షాబాద్ మండలం మద్దూర్, హైతాబాద్‌లో ప్రచారం చేశారు. నాగర్‌గూడలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు చేవెళ్ల మండలం ఇబ్రహీంపల్లి, ఖానాపూర్, నాన్‌చెరు, కిష్టాపూర్, ఇంద్రారెడ్డినగర్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కాగా, ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బత్తిన వెంకటేష్‌గౌడ్ తన అనుచరులతో కలిసి రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. కందుకూరు మండలం ఆకులమైలారం, ముచ్చర్ల, నేదునూరు, గ్రామాల మాజీ సర్పంచ్‌లు జి.కళమ్మ రాజు, రాంచంద్రారెడ్డి, పి.యాదిరెడ్డిలతో పాటు 200మంది బీఆర్ఎస్, బీజేపీల కార్యకర్తలు, నాయకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. జడ్పీటీసీ జంగారెడ్డి ఆకులమైలారంలో ప్రచారం చేశారు. పులిమామిడికి చెందిన పి.రమేష్, వి.రాజేషల ఆధ్వర్యంలో సుమారు 30మంది వివిధ పార్టీలనుంచి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ గెలిస్తే పేదలకు ఆరు గ్యారెంటీలు వస్తాయని రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని శివరాంనగర్‌కాలనీలో ప్రచారం చేశారు.



మహేశ్వరంలో ముస్లింల మద్దతు కోరుతున్న జడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి

సమయాభావం వల్ల అందరినీ కలవలేకపోతున్నా: రంజిత్‌రెడ్డి

వికారాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి) : అందరికీ అందుబాటులో ఉండే తనకు ఓట్లేసి గెలిపించే విధంగా అందరూ కృషి చేయాలని రంజిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 30 లక్షల మంది ఓటర్లు ఉన్న చేవెళ్ల నియోజకవర్గంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారం నిర్వహిస్తున్నా సమయాభావం వల్ల అందరినీ వ్యక్తిగతంగా కలువలేకపోతున్నానని.. తనను మీ కుటుంబ సభ్యుడిగా భావించి చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. గత అయిదేళ్లుగా తాను ప్రజల మధ్యన ఉన్నానని, అందరికీ అందుబాటులో ఉండి చేతనైనంత సాయం చేస్తారనే విషయాన్ని తెలిసిన వారికి చెప్పాలని సూచించారు. లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు తనను మీ కుటుంబ సభ్యుడిగా భావించి తనకు ఓట్లేసి గెలిపించే విధంగా ప్రయత్నించాలని కోరారు. ఓటు హక్కు ఉన్న వారందరూ హాజరై ఓటు వేసేఆ కుటుంబసభ్యులకు, స్నేహితులకు, బంధువులకు, తెలిసిన వారికి చెప్పి ఓటు వేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ రహదారిపై ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

» పట్టించుకోని అధికారులు » వాహనదారుల ఇబ్బందులు

» రహదారిని అద్దెలకిచ్చి సొమ్ము చేసుకుంటున్న దుకాణాదారులు



ఆమనగల్లులో జాతీయ రహదారిపై ఆక్రమణలు

ఆమనగల్లు, మే 3: ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి చిరువ్యాపారుల ఆక్రమణలతో నానాటికీ ఇరుకుగా మారుతోంది. దాంతో వాహనాల రాకపోకలకు తరచూ ఇబ్బందులు కలుగుతున్నాయి. చిరువ్యాపారుల ఆక్రమణలను పట్టించుకోవలసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో రోజురోజుకూ శృతిమించిపోతున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారిపై వాహనాల రద్దీతో ఇబ్బందిగా మారింది. దీనికి తోడు చిరువ్యాపారులు రోడ్డుకిరువైపులా ఇష్టారాజ్యంగా రోడ్డును చాలావరకు ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తుండడంతో రాకపోకలు, బాటసారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దాంతో తరచూ చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బస్టాండ్ స్కూల్ నుంచి రాజీవ్ చౌరస్తా వరకు సమీపంలో కొన్నిసార్లు చిరువ్యాపారులు, వాటి ముందు కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్‌తో ఆర్టీసీ బస్సులతోపాటు పెద్ద వాహనాలు వెళ్ళడానికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చిరువ్యాపారం రోజురోజుకూ రోడ్డుమీదికి వస్తున్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపాలిటీ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. పండ్లు, టీకొట్లు, తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతరత్రా చిరువ్యాపారుల దుకాణాల కారణంగా జాతీయ రహదారిపై ప్రయాణం అసౌకర్యంగా మారిపోయింది. ఇదిలా ఉండగా, కొందరు దుకాణ యజమానులు షాపుల ఎదుట రోడ్లను ఆక్రమించి అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. రోజుకు రూ.200 నుంచి 500వరకు అద్దె వసూలు చేస్తున్నారు. ఫలితంగా దుకాణాలు అద్దెకు తీసుకున్నవారు ఆక్రమించిన రోడ్లపై వసూలు చేస్తున్న కిరాయితోనే తమ దుకాణాల అద్దెలను చెల్లిస్తున్నట్లు సమాచారం. కాగా, జాతీయ రహదారిపై వాహనాలు, చిరువ్యాపారుల ఆక్రమణల నిరోధంలో పూర్తిగా విఫలం అయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిరువ్యాపారుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ, మున్సిపాలిటీ అధికారులు, స్థానిక పోలీసులు స్పందించి చిరువ్యాపారుల ఆక్రమణలను నియంత్రించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపిక



అక్షర

మహేశ్వరం, మే 3 : జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు మహేశ్వరం మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అక్షర అనే విద్యార్థిని ఎంపికైంది. గత మార్చిలో జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లలో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులకు గచ్చిబౌలిలోని నవోదయ పాఠశాలలో జిల్లా స్థాయిలో ప్రేరణ కార్యక్రమానికి సంబంధించి వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో బాలికల విభాగం నుంచి మహేశ్వరం మోడల్ స్కూల్ లో 9 వతరగతి చదువుతున్న హెచ్. అక్షర అనే విద్యార్థిని జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు ఎంపికయ్యారు. ఈ శిక్షణకు ఎంపికైన విద్యార్థినికి ఈనెల 20నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు గుజరాత్ రాష్ట్రంలోని వాదానగర్‌లో శిక్షణ ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్ తెలిపారు. మోడల్‌స్కూల్ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని అక్షరను అభినందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాఠశాలలోని ప్రతీ విద్యార్థి కృషి పట్టుదలతో విద్య నభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నదే తమ లక్ష్యమని ప్రిన్సిపాల్ తెలిపారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేఎస్ రత్నం

చేవెళ్ల, మే 3: అధికార పార్టీలో ఉండి ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్ల అభివృద్ధికి శాశ్వతంగా ఏం అభివృద్ధి పనులు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో టికెట్ ఇచ్చిన కాదని కాంగ్రెస్ పార్టీలో చేరడానికి గల కారణాలు చెప్పాలన్నారు ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎం. రమణారెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.

బీజేపీకి రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాలు ఖాయం

మొయినాబాద్ రూరల్: పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి మెజారిటీ ఎంపీ స్థానాలు గెలవడం ఖాయమని బీజేపీ మొయినాబాద్ మండల ఓబీసీ విభాగం అధ్యక్షుడు అశోక్ యాదవ్ అన్నారు. మండలంలోని అజీజ్‌నగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేవెళ్ల ఎంపీగా కొండాను గెలిపించుకొనే బాధ్యత అందరిపై ఉందన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పంచెకట్టు విధానాన్ని హేళన చేయడం కాంగ్రెస్ నాయకుల వికృత బుద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, నాయకులు వడ్ల నర్సింహాచారి, దానయ్య, ముత్యాలు, నర్సింహాయాదవ్ ఉన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

తాండూరు రూరల్/దోమ/మహేశ్వరం/చేవెళ్ల: తాండూరు మండలంలోని మల్కాపూర్ గ్రామంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖాపురం ఆంజనేయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయనతో పాటు నాయకులు చిరంజీవి, నరేందర్ ఉన్నారు. అదేవిధంగా దోమ మండలంలోని ఐనాపూర్‌లో నాయకులు రాజు, నర్సింహులులు తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చలక్ష్మణ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.అదేవిధంగా చేవెళ్లలో ఎంపీపీ మాల్గారి రమణారెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, దేవుని శర్వలింగం, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు. హైదర్‌నగర్/గచ్చిబౌలి: హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీ రామాలయ టెంపుల్ వద్ద శుక్రవారం రాత్రి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకోసారి కనిపించే నాయకులను నమ్మవద్దని, నిత్యం ప్రజల్లో ఉండే కొండా విశ్వేశ్వరరెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామరాజు, శ్రీనివాస్, నవీన్‌గౌడ్, ఎంఎ దేవ్, కృష్ణంరాజు పాల్గొన్నారు. అదేవిధంగా శేరిలింగంపల్లిలో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలంతా బీజేపీకి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో అమలు చేయ్యక పోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవిధంగా జరగకుండా చూస్తామన్నారు. కేంద్రప్రభుత్వ నిధులతో చేవెళ్లను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు.



చేవెళ్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం

మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరిక

నవాబుపేట: మండలంలోని కేశవపల్లి గ్రామానికి చెందిన 60 మంది గ్రామస్థులు, యువకులు మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం సమక్షంలో శుక్రవారం బీజేపీ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాష్ పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రదక్షిణలు

మొయినాబాద్ రూరల్: నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావాలని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని చిలుకూరు బాలాజీ ఆలయంలో బీజేపీ నాయకులు శుక్రవారం 11 ప్రదక్షిణలు చేశారు. ఈ ఆలయంలో 11 ప్రదక్షిణలు చేసి కోరిక నెరవేరిన తర్వాత 108 ప్రదక్షిణలు ఆనవాయితీగా వస్తోంది. ప్రదక్షిణలు చేసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు గున్నాల మల్లారెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ దర్గా మహేందర్, బీజేపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ సంగెరి మల్లేష్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దావిద్, మహేష్‌చారి, విక్రమ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.



ప్రదక్షిణలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

● యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

యాచారం, మే 3 : ఎండలు మండుతున్నందున ఏ ఒక్క గ్రామంలో జనం తాగునీటి కోసం ఇబ్బంది పడకుండ తగిన చర్యలు తీసుకోవాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గత సమావేశంలో సూచించిన సమస్యలు ఎంతవరకు పరిష్కరించారని కార్యదర్శులను ప్రశ్నించారు. బోరుబావులు పాడైతే తక్షణమే బాగు చేయించాలన్నారు. పైప్‌లైన్ లీకైతే తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఉపాధి కూలీలు పని చేస్తున్న చోట తాగునీటిని అందుబాటులో పెట్టడంతో పాటు పేస్లిప్‌లను పంపిణీ చేయాలన్నారు. కూలీలకు మెడికల్ కిట్ అందుబాటులో పెట్టాలని చెప్పారు. ఉదయం 11గంటల వరకే ఉపాధి పనులు జరిగేలా చూడాలన్నారు. హరితహారం నర్సరీలలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఓటర్‌స్లిప్‌లు పంపిణీ చేయాలని చెప్పారు. పోలింగ్ రోజున పాఠశాలల్లో టెంట్‌లు వేయించడంతో పాటు పోలింగ్ సిబ్బందికి అన్ని రకాల వసతులు కల్పించడంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. వయో వృద్ధులకు వీల్ చైర్‌లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించడంపై దృష్టి సారించాలన్నారు.

మోదీవి విద్వేష ప్రసంగాలు : కసిరెడ్డి



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్, మే 3 : దేశంలో బీజేపీ ఓటమిని గ్రహించే ప్రధాని మోదీ విద్వేషపూరిత ప్రసంగాలు సాగిస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణం, మంగళపల్లి, కడ్తాల మండలంలోని చల్లంపల్లి, వంపుగూడలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. మల్లు రవికి మద్దతుగా నిర్వహించిన కార్యక్రమానికి కసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్య నాయక్, తదితరులున్నారు. మల్లు రవికి మాదిగలంతా మద్దతు తెలుపున్నట్లు ఆయన సతీమణి రాజబస్సీదేవి, మాదిగ, ప్రజా, అంబేడ్కర్ సంఘాల నాయకులు తెలిపారు. ఆమనగల్లులో నాయకులు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేతలతో రాజబస్సీదేవి సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మల్లు రవికి మాదిగలు మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.సుధాకర్, తలకొండపల్లి మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాములు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు డేవిడ్, జంగయ్యలు ప్రకటించారు.

బీఆర్ఎస్ పార్టీకి తల్లోజు రామకృష్ణ రాజీనామా



ఆమనగల్లు, మే 3 : బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమ నాయకుడు తల్లోజు రామకృష్ణ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజీనామా పత్రాన్ని మాజీ సీఎం కేసీఆర్, జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన రామకృష్ణ 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు కృషి చేశాడు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఏకపక్ష నిర్ణయాలు, వైఖరి నచ్చక బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు రామకృష్ణ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమకారులను జైపాల్ యాదవ్ ఏనాడూ పట్టించుకోలేదని, రియల్టర్లకు, అవకాశవాదులకు పార్టీలో పెద్దపీట వేశారని రామకృష్ణ ఆరోపించారు. త్వరలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని రామకృష్ణ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ది అసమర్థ పాలన



మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, మే 3 : రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన మూలంగా గ్రామీణ ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో శుక్రవారం గోలి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎ న్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు. అబద్ధపు ప్రచారాలు, అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అనతి కాలంలోనే ప్రజావిశ్వాసం కోల్పోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు భీమయ్య, నర్సింహ, శ్రీను, మైసయ్య, అలీ, లాలయ్య, యాదయ్య, మల్లయ్య, జంగయ్య, రాంమచంద్రయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

8న కేటీఆర్ బహిరంగ సభ

ఆమనగల్లు, మే 3 : కల్వకుర్తి నియోజకవర్గంలో ఈనెల 8న మాజీ మంత్రి కేటీఆర్ పర్యటిస్తున్నట్లు కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్వకుర్తి పట్టణంలో నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో సత్యం విలేకరులతో మాట్లాడారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

మంచాల, మే 3 : నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నేతలు కె.శ్రీనివాస్‌నాయక్, చెరుకు గణేష్‌లు పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికు మద్దతుగా మంచాల మండల పరిధి లోయపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు.

అండర్‌పాస్.. యమ డేంజర్

● సూచికలు లేక తరచూ ప్రమాదాలు

● వాహనదారుల ఇబ్బందులు

కొత్తూర్, మే 3: స్థానిక మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ సమీపంలో గల రైల్వే అండర్ పాస్ యమ డేంజర్‌గా మారింది. అండర్‌పాస్ నిర్మించారే తప్పా.. ఎటువంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తిమ్మాపూర్ నుంచి గూడూర్, చేగూర్ గ్రామాలకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం రెండు సంవత్సరాల క్రితం రైల్వే అండర్ పాస్ నిర్మించారు. అండర్‌పాస్ వద్ద వై ఆకారంలో గూడూర్, చేగూర్ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్లు ఏర్పాటు చేశారు. అండర్‌పాస్ వద్ద వై ఆకారం కలిగిన రోడ్లు ఉండడంతో ఎదురెదురుగా వచ్చే వాహనలు దగ్గరకు వచ్చే వరకు కూడా కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అండర్ పాస్ వద్ద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు తికమకకు గురై ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ముందుకు సాగాల్సి వస్తుంది. రాత్రి సమయాల్లో వాహనచోదకులు తీవ్ర భయాందోళనకు గురవుతూ ప్రయాణిస్తుంటారు. తిమ్మాపూర్ పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలతో పాటు, చేగూర్ శివారులో కన్హా శాంతివనం ఉండడంతో భారీ వాహనాలతో పాటు, ఇతర వాహనాల రాకపోకలు భారీగా ఉంటాయి. అలాగే ఈ ప్రాంత పరిసరాల్లో వ్యవసాయ భూములు ఉండడంతో రైతులు తమ పొలాలకు వచ్చి వెళ్తుంటారు. అండర్ పాస్ వద్ద రేడియం సూచిక బోర్డులతో పాటు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సూచికలు లేకుండా ఉన్న తిమ్మాపూర్ రైల్వే అండర్‌పాస్

కాంగ్రెస్‌తోనే సంక్షేమం : వీర్లపల్లి



షాద్‌నగర్ రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్/నందిగామ/కొత్తూర్, మే 3: కాంగ్రెస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి, రాసుమల్లగూడలో ప్రచారం చేశారు. పొలాల వద్ద ఉపాధిపనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, బీజేపీలు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు తమ అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. దేవునిపల్లి, అన్నారం తాజా మాజీ సర్పంచ్‌లు చేగూరి రాఘవేందర్‌గౌడ్, లంకాల రాములుగౌడ్, రాయికల్, చింతగూడ, అన్నారం మాజీ సర్పంచ్‌లు ఆశన్న, ఆనంద్, బాలూనాయక్‌లు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో శంకర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. నందిగామ మండలం రంగాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ఉపసర్పంచ్ శేఖర్, మాజీ వార్డుసభ్యులు, నాయకులు షాద్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో వీర్లపల్లి సమక్షంలో పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

కొత్తూర్/కేశంపేట/చౌదరిగూడ/కొందుర్గు : కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన అందుతుందని కేశంపేట జడ్పీటీసీ, మండల ఎన్నికల ఇన్‌చార్జి విశాలశ్రవణ్ అన్నారు. మండల పరిధిలోని కొడిచర్ల, కొడిచర్ల తండాల్లో వంశీచంద్‌రెడ్డి తరఫున ప్రచారం చేశారు. వంశీచంద్‌ను గెలిపించాలని కేశంపేట మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి మహ్మద్ ఇబ్రహీం కోరారు. నిర్దవెల్లి జామా మసీద్‌లో ప్రార్థనల అనంతరం ముస్లిం పెద్దలతో సమావేశమయ్యారు. గ్రామంలో ప్రచారం చేశారు. చౌలపల్లిలో మండలాధ్యక్షుడు వీరేశ్ వంశీచంద్ రెడ్డికి ఓటు వేయాలని కోరారు. చౌదరిగూడ మండలం తూంపల్లి లాల్‌పహడ్, కాస్లాబాద్, లో వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, తదితరులు ప్రచారం చేశారు. వంశీచంద్‌ను గెలిపించాలని కొందుర్గు మండల ఇన్‌చార్జి శ్యాంసుందర్‌రెడ్డి మండల కేంద్రంలో ప్రచారం చేశారు. చెర్కుపల్లి, ఆగిర్యాల, తంగళ్లపల్లి, అయోధ్యాపూర్‌తాండ, చిన్నఎల్కిచర్లలో యాదయ్య, కె.రాములుగౌడ్, కె.దశరథ, ప్రచారం చేశారు.



పోలీసులకు ఫిర్యాదు పత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అసత్య ప్రచారాలపై చర్యలు తీసుకోవాలి

తలకొండపల్లి, మే 3 : సోషల్ మీడియా ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు పోలీసులను కోరారు. ఈ మేరకు శుక్రవారం డీసీసీ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి అంజయ్య ఆధ్వర్యంలో నాయకులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజేశ్ నాయక్ అనే వ్యక్తి కాంగ్రెస్‌ను కించపరిచేలా, పార్టీ అగ్రనేతలను విమర్శిస్తూ పలు వాట్సాప్ గ్రూప్‌లకు సందేశాలను పంపుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ జరిపి గ్రూప్ అడ్మిన్లు, పోస్టులు పెడుతున్న విజేశ్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు రవీందర్ యాదవ్, డిగ్రీ కృష్ణ, రమేశ్, మల్లేశ్, పాండు, నర్సింహ, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీకే అరుణ గెలుపు ఖాయం



షాద్‌నగర్‌రూరల్: బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్/చౌదరిగూడ/కేశంపేట, మే 3: పాలమూరు నుంచి బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో అరుణకు మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరు మోదీ పాలన కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువాలు ఆహ్వానించారు. దేవునిపల్లిలో జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్త ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీనే గెలిపించాలని జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లలో లోక్‌సభ ఎంపీ అభ్యర్థి డీకే అరుణమ్మకు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పాలమూరు ముద్దుబిడ్డ, నరేంద్ర మోదీ ఆశీస్సులతో లోక్‌సభ అభ్యర్థిగా ఉన్న డీకే అరుణమ్మను ఆశీర్వదించి గెలిపించాలని ఉపాధి కూలీలను అభ్యర్థించారు. మనోహర్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, వెంకటేష్, నర్సింహులు, రాంచంద్రయ్య, అనంతయ్యలున్నారు. దేశ ఉన్నతి కోసం మరోసారి నరేంద్ర మోదీని ప్రధానిగా చూడాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని కేశంపేట మండలాధ్యక్షుడు రఘురాములుగౌడ్ అన్నారు. అల్వాల, తులవానిగడ్డ, మంగళగూడ, బైర్కాన్‌పల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. కొత్తపేటలో మాజీ వైస్ఎంపీపీ నర్సింహయాదవ్ ప్రచారం చేశారు. అరుణమ్మను గెలిపించాలన్నారు. మోటె శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, ఐలయ్య, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రొల్లు రమేష్, వెంకటేశ్వర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే హవా



ఇబ్రహీంపట్నం : రాందాస్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఆరోని

మంచాల/ఇబ్రహీంపట్నం, మే 3 : అసెంబ్లీ ఎన్నికల్లో 6 గ్యారెంటీల పేరుతో 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా కొనసాగుతుందని మంచాల ఎంపీపీ జాటోత్ నర్మద, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చీరాల రమేష్‌లు అన్నారు. భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా తిప్పాయిగూడ, చిత్తాపూర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మాజీ చైర్మన్ సికిందర్‌రెడ్డి, బహదూర్, తదితరులున్నారు. అలాగే మల్లేష్‌కు మద్దతుగా ఆయన తనయ ఆరోని ఇబ్రహీంపట్నం మండలం మల్‌శెట్టిగూడెం, చింతపల్లి గూడెం, రాందాస్‌పల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అల్వాల వెంకట్‌రెడ్డి, మొద్దు అంజిరెడ్డి, వెంకట్ రెడ్డి, కె.సంధ్యదయాకర్, వీరారెడ్డి, నరేష్, మల్లేష్, మహేష్, సురేందర్ తదితరులున్నారు.

షాద్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటే



కొత్తూర్ : కొడిచర్లలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొందుర్గు/కొత్తూర్/కేశంపేట/చౌదరిగూడ, మే, 3: షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, బీజేపీలు ఒక్కటేనని షాద్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్ ఆరోపించారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేయించి మన్నే శ్రీనివాస్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. కొత్తూర్ మండలం కొడిచర్లలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. మన్నే శ్రీనివాస్ రెడ్డి గెలువాంటూ కొత్తపేటలోని దర్గా, రామలింగేశ్వరాలయంలో పూజలు చేశారు. సంతాపూర్, కొనాయపల్లిలో మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు ప్రచారం చేశారు. చౌదరిగూడ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ చౌదరిగూడలో మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



మాల్‌లో కవాతు నిర్వహిస్తున్న అధికారులు

యాచారం, మే 3 : ఈనెల 13న ఎన్నికల్లో ప్రతీ ఒ క్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్ డీవో అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు చెప్పారు. శుక్రవారం సాయంత్రం వారు యాచారం మండలంలోని మాల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాలలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టినా బెదిరించినా చట్టపరంగా తాము కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతియుతంగా పోలింగ్ జరగడానికి ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేయడం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా తగిన చ్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లకు మద్యం, డబ్బు పంపిణీ చేయకుండ ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని వారు పేర్కొన్నారు. ఓటు వేయడానికి నడవలేని వారికి పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇంటి వద్దే ఉండి ఓటు వేయడం కోసం తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాన్స్ జెండర్లకు కూడా ఓటు హక్కుకల్పించిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎస్సైలు వెంకటనారాయణ, గోపాల్ తదితరులున్నారు.

విద్యార్థులకు సన్మానం

ఇబ్రహీంపట్నం, మే 3: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను శుక్రవారం ప్రముఖ సంఘ సేవకుడు బజారు భిక్షపతి ఘనంగా సత్కరించారు. పాఠశాలలో 20 మంది విద్యార్థులకు గాను 19 మంది విద్యార్థులుపదో తరగతి వార్షిక పరీక్షలో పాసయ్యారు. జి.అక్షిత 9.5, ఎం.దీప్తి 9.3, అఖిల 9.2 జీపీఏ సాధించారు. కాగా ప్రేరణ కార్యక్రమానికి పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న భానుప్రసాద్ ఎంపికయ్యారు. వీరందరిని ప్రముఖ సంఘ సేవకుడు బజారు భిక్షపతి సత్కరించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ ధనం కంటె విద్య నేర్చుకుంటే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఉన్నత చదువులు చదివిన వారికి సమాజంలో ఆదరణ ఉంటుందన్నారు. మార్కుల కోసం కాకుండా విజ్ఞానం సంపాదించడంకోసం చొరవ తీసుకోవాలన్నారు. తక్కువ జీపీఏ వ చ్చిందని ఆందోళన చెందరాదన్నారు. ఇ వి ప్రామాణికం కాదన్నారు. పాఠశాల విద్యార్థులను విజ్ఞాన వంతులుగా మార్చుతున్న ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మారోజు సుధాకర్, ఉపాధ్యాయులు అ రుణశ్రీ, వెంకటయ్య, బీరప్ప, శ్రీలత, బాలాచౌరీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎలిమినేడు పాఠశాలలో సన్మానం పొందిన విద్యార్థులు

బీజేపీకి మద్దతు ఇవ్వండి

యాచారం, మే 3 : దేశంలో నిరుపేదల ఉద్ధరణకు పాటు పడుతున్న బీజేపీకి మద్దతు ఇచ్చి సహకరించాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అన్నారు. శుక్రవారం ఆమె నజ్దిక్‌సింగారంలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె కూలీలకు శీతలపానీయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వారితో మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పోలింగ్‌లో ఎంపీగా డా.బూరనర్సయ్య గౌడ్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతీ నెల ఒక వ్యక్తికి ఆరు కిలోల రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ, శ్మశాన వాటికల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చిందన్నారు. ఉపాధి కూలీలకు ఉపాధి కల్పించి ఆదుకుంటుంది కేంద్ర ప్రభుత్వమని గుర్తుచేశారు. రోజుకు ఒక్క కూలీకి రూ.300 ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వన్నవాడ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

బీజేవైఎం మండల అధికార ప్రతినిధిగా శ్రీనివాస్‌రెడ్డి



షాబాద్, మే 3 : బీజేవైఎం షాబాద్ మండల అధికార ప్రతినిధిగా రుద్రారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మండల అధ్యక్షుడు మహేష్, జిల్లా అధ్యక్షుడు యాదీష్ గార్లకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి కోసం కష్టపడి పనిచేస్తానన్నారు.

క్రైం కార్నర్

బర్త్‌డే కేక్ కోసం వెళ్లి బాలుడి దుర్మరణం

● రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో మృతి



సందీప్(ఫైల్)

షాద్‌నగర్ రూరల్, మే 3 : పుట్టినరోజు వేడుకను స్నేహితుల మధ్య సంతోషంగా జరుపుకోవాలని భావించాడు ఆ బాలుడు. ఈమేరకు కేక్ తెచ్చుకునేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని కేశంపేట బైపాస్ చౌరస్తాలో గురువారం రాత్రి 11.30 గంటలకు జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని రతన్ కాలనీకి చెందిన బిజ్వి సందీప్(16) నేడు(శుక్రవారం) పుట్టిన రోజు కావడంతో స్నేహితులతో కలిసి కేక్ కట్ చేయాలని గురువారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. కేశంపేట బైపాస్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న తవేరా వాహనం బాలుడిని ఢీకొంది. దాంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఈత కోసం వెళ్లిన బాలుడి మృతి



రామకృష్ణ(ఫైల్)

చేవెళ్ల, మే 3 : వేసవికాలం కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా ఈత కోసం వెళ్లిన బాలుడు బావిలోనే మృతిచెందిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీస్‌లు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎదిరే విఠలయ్య చిన్న కుమారుడు రామకృష్ణ (16)గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావిలో రోజూ ఈతకు వెళ్తున్నాడు. శుక్రవారం కూడా బావిలో ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో నీటి అడుగు వరకు వెళ్లడంతో బురదలో చిక్కుకున్నాడు. అదేవిధంగా అందులో ఉన్న డ్రిప్ పైప్ మెడకు చుట్టుకోవడంతో పైకి రాలేకపోయాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో స్నేహితులు తల్లిదండ్రులకు విషయం చెప్పారు. వారితో పాటు గ్రామస్తులు వెళ్లి వెతికినా బాలుడి ఆచూకీ లభించకపోవడంతో బావిలో ఉన్న నీరంతా మోటార్ సాయంతో బయటకు తోడేశారు. అనంతరం బురదలో చిక్కుకుని ఉన్న బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన వాటర్ ట్యాంకర్

ఆమనగల్లు , మే 3: మండల పరిధిలోని కోనాపూర్ గేటు వద్ద శుక్రవారం ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా పడింది. కాగా, త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. రాంనుంతల వైపు నుంచి నీరు నింపుకొని వెళ్తున్న ట్యాంకర్‌తో కూడిన ట్రాక్టర్ కోనాపూర్ గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ నరేశ్ స్వల్పంగా గాయపడ్డాడు. కాగా, ఆ సమయంలో రోడ్డుపక్కన ఉన్నవారు వెంటనే అప్రమత్తం కావడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది.

చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు

శంషాబాద్, మే 3 : షాపులో ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించిన కేసును శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు శుక్రవారం ఛేదించారు. స్టేషన్ సీఐ బాలరాజ్ కేసు వివరాలను తెలిపారు. ఎయిర్ పోర్టు నిర్వాసితుల కాలనీలోని ఓ దుకాణంలో మహిళ వద్దకు ఓ వ్యక్తి వెళ్లి వాటర్ బాటిల్ కావాలని అడిగాడు. ఆమె బాటిల్ ఇవ్వడానికి కిందకు వంగగా ఆగంతుకుడు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. ఎన్నికల విధుల్లో ఉన్న శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ వాహనదారుడు అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌లోకి తీసుకెళ్లి విచారించగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడింది తానేనని ఒప్పుకున్నాడు. పట్టుబడిన నిందితుడు ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన చంద్రకాంత్‌గా గుర్తించారు. నిందితుడు అమెజాన్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తాడని చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

బోరు మోటార్ల సర్వీస్ వైర్లు అపహరణ

ఇబ్రహీంపట్నం, మే 3: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పరిగూడ గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు 20 వ్యవసాయ బోర్ బావుల వద్ద మోటర్ల సర్వీస్ వైర్లను అపహరించుకెళ్లారు. గ్రామానికి చెందిన బూడిద వెంకటరెడ్డి, పోరెడ్డి మహేందర్ రెడ్డి తదితర 20 మంది మోటార్లకు చెందిన సర్వీస్ వైర్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈమేరకు శుక్రవారం రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వీస్ వైర్ల విలువ దాదాపు రూ.లక్ష విలువ ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం పోలీసులు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొత్తూర్, మే 3: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన అర్జునయ్య(45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాస్, గ్రామస్తుల కథనం ప్రకారం.. ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అర్జునయ్య గురువారం ఇంటికి రాగా, భార్యభర్తలు గొడవపడ్డారు. ఈక్రమంలో అర్జునయ్యకు గాయాలు కావడంతో కుటుంబసభ్యులు గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద ప్రథమ చికిత్స చేయించి, షాద్‌నగర్‌లోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. మృతుని కుమార్తె సుప్రజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు అదారంగా మృతికి గల కారణాలు వెల్లడిస్తామని తెలిపారు.

శరీరక ధారుడ్యానికి క్రీడలు దోహదం

కొత్తూర్, మే 3: క్రీడలు శరీర ధారుడ్యానికి దోహదపడుతాయని స్థానిక ఎంపీపీ పి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుడూర్ గ్రామంలో గుడూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని శుక్రవారం ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలపై మక్కువ పెంచుకుని రాష్ట్ర, దేశ స్థాయికి ఎదుగాలన్నారు. క్రీడలు స్నేహబావంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని తెచ్చిపెడుతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే క్రికెట్ టోర్నీలో 6జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. టోర్నీ విన్నర్‌కు 10వేల రుపాయల నగదుతో పాటు షీల్డ్, రన్నర్‌కు 5వేల రుపాయల నగదుతో పాటు షీల్డ్‌లు అందిస్తారని పేర్కొన్నారు. స్వంత ఖర్చులతో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్తయ్య, రవినాయక్, కాట్న రాజు, మాజీ ఉపసర్పంచ్ దయానంద్‌గుప్త, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ పద్మారావు, నాయకులు శ్రీరాములు, మోది దర్శన్, మల్లేష్, రాజు, జైహింద్‌రెడ్డి, నర్సింహ్మరెడ్డి, సిద్దుగౌడ్, సదానంద్, సలీం, నరేందర్, పాండు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి